క్లుప్తంగా

పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర అవతరణకు తన ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములు పేరిట ఉన్న తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయన పేరు తొలగించకుండా కొనసాగించాలని సిద్దిపేట ఆర్యవైశ్యులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెడతామని అసెంబ్లీలో కాంగ్రెస్ నాయకులు ప్రకటించడం సరికాదన్నారు. సురవరం ప్రతాపరెడ్డి చేసిన సేవలకు గుర్తింపుగా మరేదైనా ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టాలని కోరారు. పొట్టి శ్రీరాములు ఏ ఒక్క రాష్ట్రానికో, జాతికో చెందిన వ్యక్తి కాదని, అందరివాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను వెనక్కి తీసుకోవాలన్నారు.

వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా గుర్తింపు



సర్టిఫికెట్ అందజేస్తున్న ఇంపాక్ట్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వరరావు

వర్గల్(గజ్వేల్): వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు, వర్గల్ మండలం చౌదరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ గుర్తింపు పొందారు. శనివారం హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో నిర్వహించిన మెగా ఇంపాక్ట్ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వరరావు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ డైరెక్టర్ శ్యామ్ రాథోడ్, లక్ష్మణ్ వాడేకర్, హైమవతి, వెంకటేశ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఏబీసీ కేంద్రం పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ప్రేరణ

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ప్రేరణ పాండ శనివారం పరిశీలించారు. వీధి కుక్కల జనన నియంత్రణ కోసం కేంద్రంలో త్వరగా వసతులు కల్పించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్, నీటి వసతి, ఆపరేషన్ థియేటర్, కుక్కలను భద్రపరిచే గది తదితర అంశాలపై చర్చించారు. ఆమె వెంట మున్సిపల్ అధికారులు అన్వేష్, సతీష్, మాధవి తదితరులు ఉన్నారు.

గద్దర్ వర్ధంతి సభను జయప్రదం చేద్దాం

గజ్వేల్‌రూరల్: ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని జయప్రదం చేయాలని గద్దర్ ఫౌండేషన్ సభ్యుడు ఆస శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో గద్దర్ వర్ధంతి వాల్‌పోస్టర్‌ను మాల మహానాడు రాష్ట్ర నాయకులు తుమ్మ శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ బందారు రాజు, టీపీసీసీ నాయకుడు డాక్టర్ గద్దం శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 6వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గద్దర్ ప్రథమ వర్ధంతి నిర్వహిస్తామన్నారు.

అవయవదానంతో పునర్జన్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అవయదానంతో మరొకరికి పునర్జన్మ ప్రసాదించినట్లేనని చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ లక్ష్మణ్ అన్నారు. శనివారం జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతీయ అవయవదానం దినం సందర్భంగా జిల్లా కేంద్రంలో అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అవయవదానం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ బ్రెయిన్ డెత్, మరణించిన వారి అవయవాలను అత్యవసరం ఉన్న వారికి దానం చేస్తే వారికి ప్రాణం పోసినవారవుతారన్నారు.

18న పాపన్న గౌడ్ జయంతి నిర్వహిద్దాం

సిద్దిపేటజోన్: ఈనెల 18న జిల్లా వ్యాప్తంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించాలని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బాలకిషన్ గౌడ్ పిలుపు ఇచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సర్దార్ పాపన్న గౌడ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట గౌడ సంఘం, సర్దార్ పాపన్న గౌడ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సిద్దిపేటలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించిన ఎమ్మెల్యే హరీశ్ రావు, మున్సిపల్ చైర్మన్ మంజులకు కృతజ్ఞతలు తెలిపారు.

అథ్లెటిక్స్ క్రీడలతో భవిష్యత్తు

సిద్దిపేటజోన్: అథ్లెటిక్స్ క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్ పేర్కొన్నారు. శనివారం డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు.

స్వచ్ఛదనం ఐదు రోజులు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు, తడి, పొడి చెత్త సేకరణ, మొక్కల పెంపకం, వీధి కుక్కల జనన నియంత్రణ, శిథిలమైన ఇళ్ల కూల్చివేత పనులు చేపట్టనున్నారు.



గజ్వేల్‌లో మాట్లాడుతున్న కమిషనర్ గోల్కొండ నర్సయ్య



మాట్లాడుతున్న వర్గల్ మండల ప్రత్యేకాధికారి కవిత



మాట్లాడుతున్న హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రజిత



మాట్లాడుతున్న దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



సిద్దిపేటలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్



మాచాపూర్‌లో..

సిద్దిపేటరూరల్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు సంపూర్ణ ఆరోగ్యం కలిగిస్తుందని మెడికల్ ఆఫీసర్ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రావురూకుల గ్రామంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో బాలింతలు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు పట్టిస్తే ఎంతో మేలు కలుగుతుందన్నారు.

బిడ్డకు తల్లిపాలు అవసరం

చేర్యాల(సిద్దిపేట): పుట్టిన బిడ్డకు ఇచ్చే ముర్రుపాలు ఎంతో అవసరమని అంగన్‌వాడీ టీచర్ రమ్య అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణ పరిధిలోని బండపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, 6 నెలల వయసు వచ్చే వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు.

సిద్దిపేటలో..

సిద్దిపేటకమాన్: తల్లిపాలు బిడ్డకు మేలని సిద్దిపేట మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ప్రైవేటు నర్సింగ్ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలు పట్టించడంవల్ల తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ, మాచాపూర్, రామునిపట్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయాలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

తొగుట(దుబ్బాక): సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానన్నారు. మండలంలోని తుక్కాపూర్ మదిర కాశవాడలో బోరుబావి తవ్వకం పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. రాష్ట్రంలోని రైతులకు రుణ మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంగా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ విజయ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, మండల అధ్యక్షుడు స్వామి, నాయకులు నరేందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, అమీర్, హుసేన్ పాల్గొన్నారు.



బోరుబావి తవ్వకం పనులను ప్రారంభించిన శ్రీనివాస్‌రెడ్డి

భద్రతకు ప్రత్యేక చర్యలు : ఏసీపీ

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ప్రజల రక్షణ, భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందని సిద్దిపేట ఏసీపీ మధు పేర్కొన్నారు. శనివారం కాళ్లకుంట కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. పోలీస్ శాఖ చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా భద్రత పరంగా తీసుకోవాల్సిన చర్యలు గురించి కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను నేరుగా క్షేత్ర స్థాయిలో తెలుసుకునే ప్రయత్నంలో భాగమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమమని వివరించారు. కార్యక్రమంలో వన్ టౌన్, టూటౌన్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మాబాబు, ఉపేందర్, విద్యాసాగర్, దుబ్బాక సీఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.



కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఏసీపీ మధు

చెరువు మట్టిని వినియోగించుకోవాలి

లోడి సంస్థ కోఆర్డినేటర్ బాలశౌరి

అక్కన్నపేట(హుస్నాబాద్): చెరువు పూడిక మట్టిని రైతులు వినియోగించుకోవాలని లోడి సంస్థ కోఆర్డినేటర్ బాలశౌరి అన్నారు. అక్కన్నపేట మండలం గండిపల్లి, మంజ్యానాయక్ తండాలో లోడి సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మానోస్ యూనిదాస్ సహకారంతో చెరువు పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల్లో పూడిక తొలగిస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరిగి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భూగర్భ జలాలు పెరిగి సాగునీటికి ఇబ్బంది ఉండదని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ మండల ఫీల్డ్ కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, కనకం రవీందర్, బిచ్చ, తిరుమల, రమేష్, రైతులు పాల్గొన్నారు.



గండిపల్లి గ్రామ చెరువులో పూడికతీత పనులను ప్రారంభిస్తున్న బాలశౌరి

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో బీజేపీ నాయకులు

హుస్నాబాద్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కరీంనగర్‌లో శనివారం బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు పని చేయాలని సూచించారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచేలా కృషిచేయాలని సూచించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరాచారి, రాంప్రసాద్ ఉన్నారు.

వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవాన్ని సిద్దిపేటలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ కనకరాజు, ఇన్‌చార్జి కమిషనర్ ప్రేరణతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వనమహోత్సవంలో భాగస్వాములు కావాలన్నారు. అంతరించిపోతున్న అడవులను కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మానవ మనుగడకు చెట్లు ఆధారమన్నారు. ఈనెల 5వ తేదీన సిద్దిపేటలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన పనులు గురించి వివరించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేకంగా దృష్టిసారించడంతో సిద్దిపేట మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున గతంలో మొక్కలు నాటి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచామన్నారు. అనంతరం వీధి కుక్కల బెడదపై సమీక్షించారు. త్వరగా ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో అధికారులు యాదగిరి, అన్వేష్, సతీష్, వనిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు

పలు లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు

సిద్దిపేటకమాన్: లాడ్జీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సిద్దిపేట వన్ టౌన్, టూటౌన్ సీఐలు లక్ష్మీబాబు, ఉపేందర్ అన్నారు. సిద్దిపేటలోని పలు లాడ్జీల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించి, రిజిస్టర్లను పరిశీలించారు. అదేవిధంగా గజ్వేల్, హుస్నాబాద్ పట్టణాలలోని పలు లాడ్జీలను పోలీసులు తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్ ప్రింట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడారు. ఎవరైనా లాడ్జీల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వివరాలు ప్రతీరోజు పోలీసు స్టేషన్‌లకు పంపించాలన్నారు. లాడ్జీలకు వచ్చే వారి నుంచి ఆధార్ జిరాక్స్ తీసుకోవాలని సూచించారు. లాడ్జీల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, జూదం, వ్యభిచారం జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత లాడ్జీల నిర్వహకులదే అన్నారు.



సిద్దిపేటలోని లాడ్జీలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సన్న బియ్యం సరఫరా చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ కుమార్



బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం సరఫరా చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్ అన్నారు. శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని పారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యానికి బదులు దొడ్డుబియ్యం సరఫరా చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అభి, రమేష్ పాల్గొన్నారు.

వయనాడ్ ప్రజలకు అండగా ఉందాం

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు నవీన

దుబ్బాకటౌన్: వర్షాలకు నష్టపోయిన కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రజలకు అండగా నిలవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు సింగిరెడ్డి నవీన పిలుపు ఇచ్చారు. వయనాడ్ బాధితుల కోసం శనివారం దుబ్బాక పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయనాడ్‌లో కొండ చరియలు విరిగి పడిన ఘటనలో 300 మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడ్డారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు యావత్ ప్రపంచం బాధితులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం దుబ్బాక మండల కమిటీ సభ్యులు కోంపల్లి భాస్కర్, నాయకులు రాజు, మల్లేశం తదిరులున్నారు.



దుబ్బాకలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు సింగిరెడ్డి నవీన

జాబ్ క్యాలెండర్ పచ్చి మోసం

గజ్వేల్ మాజీ మార్కెట్ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్: ఉద్యోగాల కల్పనలో స్పష్టత ఇవ్వకుండా నిరుద్యోగులను ఏమార్చేందుకు ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిందని, ఇది పచ్చి మోసమని గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వారిని నట్టేట ముంచిందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఒక్క కొత్త ఉద్యోగం ఇవ్వలేక పోయారని విమర్శించారు.



మాదాసు శ్రీనివాస్

సంక్షిప్త వార్తలు

◆ **అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య**

చేర్యాల(సిద్దిపేట): పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. మృతుడి భార్య, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మ్యాక సత్తయ్య(37) కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చే విషయమై శుక్రవారం రాత్రి భార్య కృష్ణవేణితో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెంది శనివారం ఉదయం భార్య పొలం పనికి వెళ్లిన అనంతరం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

◆ **రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి**

కొమురవెల్లి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మర్రిముచ్చాలలో జరిగింది. శనివారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మర్రిముచ్చాలకు చెందిన పుల్లం వెంకట నర్సయ్య(68) తన బైక్‌పై శుక్రవారం రాత్రి గ్రామంలోని సిద్దిపేట-జనగామ ప్రధాన రహదారి దాటుతుండగా చేర్యాల నుంచి సిద్దిపేట వెళ్తున్న ఏపీ 39 ఎస్‌కె 0123 నంబరు గల కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు విష్ణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ రాజు తెలిపారు.

◆ **మందుబాబులకు జరిమానా**

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో వారం క్రితం వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో తొమ్మిది మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.4,500 జరిమానా విధించారు.

◆ **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

సిద్దిపేట కమాన్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సిద్దిపేటలో జరిగింది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట అంబేడ్కర్ నగర్‌కు చెందిన కొత్త బాబు (35) వాషింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికిగురై మూడు రోజుల క్రితం బాబు పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

◆ **స్నేహితుడికి చేయూత**

జగదేవ్‌పూర్(గజ్వేల్): బాల్యమిత్రుడు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు అండగా నిలిచారు. మండలంలోని మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001 లో పదో తరగతి చదువుకున్న దొమ్మట బాల్‌రాజు అనారోగ్యానికి గురై ఆర్‌వీఎం ఆసుపత్రిలో చేరాడు. ఈ విషయం తెలుసుకున్న అతడి మిత్రులు శనివారం బాల్‌రాజును పరామర్శించి, రూ.43 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహేష్‌యాదవ్, సత్యనారాయణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

◆ **గోరింటాకు సంబురం**

రాయపోలు(దుబ్బాక): మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఆషాఢ మాసం గోరింటాకు సంబురం జరుపుకున్నారు. సంస్కృతి, సాంప్రదాయాల ప్రాధాన్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు రమాదేవి, వంశీకృష్ణ, స్రవంతి, మంజుల, శృతి తదితరులు పాల్గొన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని బండపల్లికి చెందిన అనంతుల నర్సమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.60 వేల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శనివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ లబ్ధిదారుకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నర్సమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయగా, ప్రభుత్వం స్పందించి రూ.60 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు.

◆ **ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానం**

మద్దూరు(హుస్నాబాద్): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. శనివారం మద్దూరు మండల పరిధిలోని లద్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్తులు తమ వార్డుల పరిధిలో, ఆలయాల వద్ద, ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలన్నారు. గ్రామాల్లోకి అపరిచితులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్ నేరమన్నారు. పోలీసు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **ఆడబిడ్డ పేరిట పోస్టల్ డిపాజిట్**

దుబ్బాక రూరల్: నియోజకవర్గంలో తొలిసారి ఎవరికైన ఆడపిల్ల జన్మిస్తే వారి పేరిట కొంత ఆర్థిక సాయం చేయాలనే బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక తనపేరిట 'కార్తీక అక్క తోబుట్టువు' ప్రారంభించారు. అక్బర్‌పేట భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో చంద్రగిరి రేఖ, రాజు దంపతులకు తొలిగా ఆడబిడ్డ జన్మించింది. శనివారం ఆ బిడ్డ పేరిట రూ.5 వేలు పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలను దంపతులకు అందజేసింది.

◆ **నూతన కమిటీ ఎన్నిక**

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో మండల కల్లుగీత కార్మిక సంఘం నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ సమక్షంలో శనివారం ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా దొడ్ల విష్ణుమూర్తి, తురాయి నవీన్ గౌడ్, బురుగు శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడిగా తాళ్లపల్లి రాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా శివలింగు రమేష్ , తాళ్లపల్లి వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా గనబోయిన నర్సింహులు, కోశాధికారిగా శ్రీకాంత్ గౌడ్, సలహాదారులుగా శిక నర్సింహులు గౌడ్ కార్యదర్శులుగా ఎం.బి.స్వామి, బుడిగె రమేశ్, కెజికెఎస్ మండల అధ్యక్షుడిగా కొయ్యడ నరేష్ గౌడ్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

◆ **ఈత వనాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి**

తొగుట(దుబ్బాక): ఈత వనాలతో గీత కార్మికులు ఆర్థికాభివృద్ధి సాధించాలని మిరుదొడ్డి ఎక్సైజ్ ఎస్‌ఐ సరిత అన్నారు. శనివారం తొగుట మండలం బంజరుపల్లిలో ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈత, తాటి వనాలు అంతరించిపోతుండటంతో గీత కార్మికులకు ఉపాధి కరువైందన్నారు.

◆ **జనాభా ప్రాతిపాదికన చేపట్టాలి**

బెజ్జంకి(సిద్దిపేట): ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ సుప్రీం కోర్టు మళ్లీ సమీక్షించి జనాభా ప్రాతిపాదిక తీర్పు ఇవ్వాలని ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ శనివారం కోరారు. క్రిమీలేయర్‌ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్డినెన్స్ చేసి పేదలకు న్యాయం చేయాలన్నారు. దళిత జాతి హక్కుల కోసం ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌ల కోసం సమష్టి ఉద్యమాలు చేపట్టాలని కోరారు.

◆ **ఇద్దరికి సెంట్రల్ వర్సిటీలో సీట్లు**

వర్గల్(గజ్వేల్): వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులకు సెంట్రల్ యూనివర్సిటీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ సీట్లు లభించాయని ప్రిన్సిపాల్ డాక్టర్ గద్దం భాస్కర్‌రావు తెలిపారు. 2023-24లో డిగ్రీ పూర్తిచేసిన బి.కృష్ణవేణి, ఈ.పూజ ఎంఎస్సీ(మ్యాథ్స్)లో సీట్లు పొందారన్నారు. వారిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, శాలిని, పావని అభినందించారు.